29న అనురాగ్ సెట్

- ప్రతిభావంతులకు రూ.6.50 కోట్ల స్కాలర్‌షిప్‌లు
- అనురాగ్ వర్సిటీ విసి రామచంద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు 'అనురాగ్ సెట్' నిర్వహిస్తున్నామని ఆ వర్సిటీ విసి ఎస్.రామచంద్రం చెప్పారు. ఈ నెల 29న ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో రాతపరీక్ష ఉంటుందని వివరించారు. హైదరాబాద్‌లోని ఆ వర్సిటీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనురాగ్ వర్సిటీ సెట్‌కు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైందని అన్నారు. దరఖాస్తు చేసేందుకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఎపి, తెలంగాణలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.6.50 కోట్ల వరకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని వివరించారు. మొదటి పది ర్యాంకులు పొందిన విద్యార్థులకు వంద శాతం ఫీజు మినహాయింపు ఉంటుందనీ, ఉచిత విద్య అందిస్తామని అన్నారు. 11 నుంచి 25 ర్యాంకుల వరకు 50 శాతం, 26 నుంచి 100 ర్యాంకుల వరకు 25 శాతం ఫీజులో రాయితీ ఇస్తామని చెప్పారు. అనురాగ్ సెట్ ద్వారా ప్రవేశాలు పొందిన మొదటి 500 మంది విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందిస్తామని వివరించారు. ఎంసెట్, జెఇఇ మెయిన్‌లో ర్యాంకులు పొందిన వారికీ ఫీజులో మినహాయింపు ఉంటుందన్నారు. అనురాగ్ విశ్వవిద్యాలయ సిఇఒ ఎస్.నీలిమ మాట్లాడుతూ వర్సిటీలో ఐదు వేల సీట్లు, ఎంసెట్ ద్వారా కన్వీనర్ కోటాలో 1,200 సీట్లు ఉన్నాయని చెప్పారు. మౌలిక వసతుల కల్పన, అర్హులైన అధ్యాపకులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సమీన్ ఫాతిమా, అనురాగ్ సెట్ కన్వీనర్, అడ్మిషన్ల డైరెక్టర్ మహీపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిపిఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా నాగార్జునరెడ్డి

- నూతన కార్యదర్శివర్గం ఎన్నిక

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

సిపిఎం సూర్యాపేట జిల్లా కమిటీ నూతన కార్యదర్శివర్గ సభ్యులుగా 11 మందిని మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికైన వారిలో మల్లు నాగార్జునరెడ్డి (కార్యదర్శి), నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, ధీరావత్ రవినాయక్, పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, నగరపు పాండు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, చెరుకు ఏకలక్ష్మి, కోటగోపి ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులకు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మీకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో సిపిఎం బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం IIIrd అడిషినల్ జిల్లా మరియు ప్యామిలీ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు.
O.S.12/2021

బిట్వీన్ :
శ్రీ పంతుల భాస్కర రామమూర్తి వగైరాలు ...వాద్దు
ఎండ్:
శ్రీ పంతుల జానకిరామ జోగారావు (ఎలియాస్) పాలబాబి వగైరా ......ప్రతివాద్దు

D17 : శ్రీమతి కొల్లూరు రాజ్యం, W/o లేటు సోమనాథం, వ॥ 75 సం॥లు, ప్లాటు నెం.22003, జనప్రియ ఉటోపియ అపార్టుమెంట్సు, అట్టాపూర్, హైదరాబాద్

పై నెంబరు దావాలో షెడ్యూల దాఖల ఆస్తిపై యిందలి వాద్దు వాటా కోరిచూ మీపై మరియు మిగిలిన ప్రతివాద్దుపై పైకోర్టులో యిందలి దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు పలుమార్లు నోటీసు పంపించినచో మీరు వాటిని తెలుసుకోని తీసుకోకుండా తప్పించికోని యుండుటవలన యీ ప్రకటన మూలముగా మీకు నోటీసు చేస్తూ మీ యొక్క హాజరు నిమిత్తం **తే 07-02-2023దీ**న వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా దినమున పై కోర్టువారి ఎదుట **ఉదయం 10-30 ని॥**లకు మీరు స్వయముగా గాని, వకీలు ద్వారాగాని, పై కోర్టులో హాజరు కావలెను. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడును.

(యీ ప్రకటన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ప్రచురించడమైనది)

గంటి గోపాలకృష్ణ శర్మ
ప్రాతా మణికేశ్వర సాయి
హైదరాబాద్ — వాదులు తరుపున వకీలు,
తేది. 11-01-2023 — బొబ్బిలి

<u>ప్రత్రికా ప్రకటన</u>
మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి చింతలపూడి వారి కోర్టులో
<u>ఓ.ఎస్.నెం. 78/2022</u>

బిట్వీన్:
తాడేపల్లి అజిత్ రాజ్ ...వాది
మరియు
శ్రీమతి కాశి సంధ్యారాణి 4 వగైరా ...ప్రతివాద్దు

టు:
4వ ప్రతివాది: తాడేపల్లి నిఖిత, భర్త: సాదనాల అఖిల్ చంద్, ఎస్.పి. ఆఫీసు రోడ్డు, ఖమ్మం సిటి, ఖమ్మం జిల్లా.
5వ ప్రతివాది: శ్రీమతి శంకరపు ప్రమీలారాణి, భర్త: ఎస్.రమేష్ బాబు, R/o. డో.నెం. ఎఫ్13, హనుమాన్ పేట, పోలీస్ క్వార్టర్స్, విజయవాడ సిటీ మరియు మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా.

<u>నోటీసు</u>

నా క్లయింటు శ్రీ తాడేపల్లి అజిత్ రాజ్ వారి యొక్క పిత్రార్జితపు స్థిరాస్థి విభాగము కోరుచూ పై కోర్టు నందు దావా దాఖలు చేయగా సదరు కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులను తీసుకొనక తిరిగి పంపించినారు. సదరు కోర్టు వారు ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు నోటీసును ఆర్డరు చేసియున్నారు. కావున పై నెంబరు దావాలో మీరు **ది. 02-02-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేని ఎడల సదరు కోర్టు వారు మీ పరోక్షంలో సదరు దావాను తీర్మానించబడుదురు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

జి.నాగరాజు
వాది తరపు న్యాయవాది,
చింతలపూడి, ఏలూరు జిల్లా.

'రఫేల్' ఒప్పందంలో రూ.60 వేల కోట్ల కుంభకోణం

- అనుభవంలేని 'రిలయన్స్ డిఫెన్స్'కు రూ.30 వేల కోట్ల ఆర్డర్
- సుప్రీంకోర్టును తప్పుదోవపట్టించిన కేంద్రం
- రచయితలు రవి నాయర్, పరంజోయి గుహ
- 'రఫేల్ డీల్ - ఫ్లైయింగ్ లైస్' పుస్తక పరిచయ వెబినార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫ్రాన్స్‌తో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో రూ.60 వేల కోట్ల కుంభకోణం జరిగినట్లు అనుమానాలున్నాయని డిఫెన్స్ రంగంలో విశేష అనుభవం కలిగిన సీనియర్ జర్నలిస్టులు రవి నాయర్, పరంజోయి గుహ ఠాకుర్తా అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జరిగిన పరిణామాలు ఈ అనుమానాలకు బలం చేకూర్చేలా ఉన్నాయన్నారు.

రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందం నేపథ్యంలో.. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తిని దిగజార్చేలా మోడీ ప్రభుత్వం వ్యవహరించింది. మొత్తం వ్యవహారంపై సమగ్ర సమాచారంతో పాటు రక్షణ శాఖ సీనియర్ అధికారుల ఇంటర్వ్యూలతో సీనియర్ జర్నలిస్టులు రవి నాయర్, పరంజోయి గుహ ఠాకుర్తా రాసిన 'రఫేల్ డీల్ - ఫ్లైయింగ్ లైస్' పుస్తకాన్ని ప్రచురించారు. ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్ సమన్వయంతో బుధవారం వెబినార్ వేదికగా జరిగిన పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. పుస్తక రచయితలు రవి నాయర్, పరంజోయి గుహ ఠాకుర్తా ఢిల్లీ నుంచి వెబినార్‌కు హాజరయ్యారు.

ఫ్రాన్స్ దేశం నుంచి 126 అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాలు కొనుగోలు చేయాలని యుపిఎ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం ఉన్నట్టుండి రద్దు చేసుకోవడం అనేక అనుమానాలకు తావిచ్చిందన్నారు. దానికి సహేతుక కారణాలనూ బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలకు చెప్పలేదని రవి నాయర్ తెలిపారు. రఫేల్ వ్యవహారంలో ఐదేళ్ల శ్రమించి పుస్తకాన్ని తీసుకొచ్చామన్నారు.

126 యుద్ధ విమానాలు కొనుగోలు చేయాలని నిర్ణయించి కేవలం 37 విమానాలే కొనుగోలు చేస్తామని మోడీ ప్రకటించడం రక్షణ రంగ నిపుణులను సైతం అయోమయానికి గురిచేసిందని రవి నాయర్ చెప్పారు. రక్షణ రంగానికి సంబంధించి ఇతర దేశాల నుంచి సామాగ్రిని కొనుగోలుచేసే విషయంలో ఆర్మీ ఉన్నతాధికారులు, నిపుణులతో కేంద్రం విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరపాల్సి ఉన్నా.. మోడీ ప్రభుత్వం రఫేల్ విషయంలో వాటిని పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. అత్యవసరం అని మోడీ చెప్పే వివరణ సహేతుకంగా లేదన్నారు.

ఫ్రాన్స్‌తో రఫేల్ ఒప్పందం రద్దు వ్యవహారంపై చర్చ జరుగుతున్న సమయంలోనే మోడీ కార్పొరేట్ మిత్రులు అదానీ, అనిల్ అంబానీలు డిఫెన్స్ కంపెనీలను ఏర్పాటు చేశారని పరంజోయి గుహ చెప్పారు. ప్రధాని మోడీ ఫ్రాన్స్ పర్యటనలో ఉన్నప్పుడే ఆదేశ అధ్యక్షుడు హోలండ్ మాట్లాడుతూ 36 యుద్ధ విమానాలను మాత్రమే భారత్‌కు ఇస్తున్నామని మీడియాకు చెప్పారని గుర్తుచేశారు. అంతేకాకుండా, యుద్ధ విమానాల నిర్వహణకు సంబంధించి ఆరంగంలో ఎటువంటి అనుభవంలేని అంబానీ డిఫెన్స్‌కు రూ.30 వేల కోట్ల కాంట్రాక్టు దక్కిందని వివరించారు. అంబానీ డిఫెన్స్‌కు వేల కోట్ల డీల్ ఎలా ఇస్తారని ఫ్రాన్స్ మీడియా ఆదేశాధ్యక్షుడ్ని అడగ్గా.. మాకు మరో గత్యంతరంలేదని సమాధానం ఇచ్చారని గుహ గుర్తుచేశారు.

రక్షణ రంగ సామాగ్రి కొనుగోలు విషయంలో షరతులను నీరుగార్చే పద్ధతిలో జాతీ సెక్యూరిటీ సలహాదారు అజిత్ దోవల్ వ్యవహరించారన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై వాజ్‌పేయి కేబినేట్‌లో మంత్రులుగా పనిచేసిన సీనియర్ నాయకులు అరుణ్ శౌరి, యశ్వంత్ సిన్హా, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లు సిబిఐకి ఫిర్యాదు చేస్తే.. ఆ వెంటనే సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మని తప్పించారని గుర్తుచేశారు.

వారు సుప్రీంను ఆశ్రయించినా ఉపయోగంలేకుండా పోయిందన్నారు. సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు కేంద్రం తప్పుడు సమాచారం ఇచ్చిందని చెప్పారు. అప్పుడు సిజెగా ఉన్న రంజన్ గగోయ్ తర్వాత రాజ్యసభ ఎంపి అయ్యారని పేర్కొన్నారు. కాగ్, పిఎసిసీ కేంద్రం తప్పుదోవపట్టించిందని విమర్శించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు హోలెండ్ సన్నిహితురాలు జూలి సినిమాలో అనిల్ అంబానీ పెట్టుబడులనూ అప్పట్లో చర్చనీయాంశమయిందని తెలిపారు. ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారి రఘునాద్ నంబియార్ ఇంటర్వ్యూ కూడా ఈ పుస్తకంలో ఉందన్నారు. రఫేల్‌కు సంబంధించి భారత రక్షణ శాఖ, వాయుసేన మధ్య జరిగిన ఉత్తర పత్యుత్తరాలన్నీ 560 పేజీల పుస్తకంలో ప్రచురించామని వారు వివరించారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

- మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరోగ్య రంగంలో తెలంగాణ నెంబర్‌వన్ స్థానానికి చేరాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి హరీశ్‌రావు ఆకాంక్షించారు. ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీచింగ్ ఆస్పత్రుల పనితీరుపై ఆయన బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ మార్గనిర్దేశనంలో అందరం కలిసి చేస్తున్న కృషి వల్ల వైదారోగ్య రంగంలో దేశంలో తెలంగాణ మూడోస్థానంలో ఉందన్నారు. అధునాతన వైద్య పరికరాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమకూర్చుకుంటున్నామని వివరించారు. అవసరమైన సిబ్బందిని ఎప్పటికప్పుడు నియమిస్తున్నామని చెప్పారు. 1,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ ప్రారంభించామని అన్నారు. మెడికల్ కాలేజీల్లో 201 ట్యూటర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని వివరించారు. కొత్తగా 800 మంది పీజీ ఎస్‌ఆర్‌లను జిల్లాల్లోని మెడికల్ కాలేజీలకు, వైద్యవిధాన పరిషత్ ప్రధాన ఆస్పత్రులకు ఇచ్చామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆస్పత్రుల్లో 'రౌండ్ ద క్లాక్' వైద్యులు అందుబాటులో ఉండాలని కోరారు. రోగులు ఏ సమయంలో వచ్చినా అందుబాటులో ఉండి చికిత్స అందించాలని సూచించారు.

ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి రమేశ్, శ్రీకాంత్‌మిశ్రా

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి రమేశ్, శ్రీకాంత్ మిశ్రా, కోశాధికారిగా బిఎస్ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు 18 మంది ఆఫీస్‌బేరర్లుగా (తొమ్మిదిమంది ఉపాధ్యక్షులు, తొమ్మిదిమంది సహాయ కార్యదర్శులు) ఉండనున్నారు. కలకత్తా నగరంలో ఆ అసోసియేషన్ 26వ అఖిల భారత మహాసభ బుధవారం ముగిశాయి. అందులో నూతన కమిటీ ఎన్నుకున్నారు. అనంతరం వి రమేశ్, శ్రీకాంత్ మిశ్రా మీడియాతో మాట్లాడారు. తమ అసోసియేషన్ మహాసభలో ఉద్యోగుల, వ్యక్తిగత వ్యవహారాలకే పరిమితం కాకుండా దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులనూ చర్చించామని తెలిపారు. మహాసభలో 1,500 మంది ప్రతినిధులు, పరిశీలకులు పాల్గొన్నారని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా నిలిచిన ప్రభుత్వ రంగాల రక్షణ కోసం నిరంతర క్యాంపెయిన్ చేసేలా ఉద్యోగులను చైతన్యపర్చాలని తీర్మానించామని చెప్పారు. ఇన్సూరెన్స్ రంగంలో అపరిష్కృతంగా ఉన్న ఫ్యామిలీ పెన్షన్ పెంచి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనీ, నిరుద్యోగ యువతకు ఉపాధి తక్షణమే కల్పించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రెండు గంటల సమ్మె కూడా చేయాలని పిలుపునిచ్చారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా రాబోయే రెండేళ్లల్లో ఉద్యోగులను, ప్రజలను చైతన్య పరుస్తూ సదస్సులు, సమావేశాలు, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ రంగాల్లో వాటాల ఉపసంహరణకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు.

త్యాగరాజ స్వామి కీర్తనలు తెలుగు భాషా సంపద

ప్రజాశక్తి-కల్చరల్

త్యాగరాజ స్వామి కీర్తనలు సంగీతపరం గా ఉన్నతం కాగా తెలుగు భాషా సంపద అని పర్యాటక అభివద్ధి సంస్థ శ్రీనివాస్ గుప్తా అన్నారు త్యాగరాయ గాన సభ నిర్వహణలో కళా సుబ్బారావు కళా వేదిక పై త్యాగరాజు ఆరాధన ఉత్సవాలు లో భాగంగా నాట్య గురువు జీ. వాసు శిష్య బృందం కూచిపూడి శైలి లో త్యాగరాజ కీర్తనలు నర్తించారు. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ పాల్గొని కళాకారులను సత్కారం చేశారు.

గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభ లో బండి శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తయారీలో నైపుణ్యాల కొరత

- తెలంగాణ వృద్ధి కొనసాగాలి
- ఎఫ్‌టిసిసిఐ సమావేశంలో జయేష్ రంజన్
- స్కిల్ సెంటర్ ప్రారంభం



హైదరాబాద్ : పారిశ్రామిక రంగంలో తెలంగాణ మెరుగైన ప్రగతిని కనబర్చుతుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఇదే క్రమంలో ఉపాధి కల్పనకు అపారమైన అవకాశాలు ఉన్నప్పటికీ.. తయారీ రంగంలో నైపుణ్యవంతులైన మానవ వనరుల కొరత ఉండటం దురదృష్టకరమన్నారు.

బుధవారం ఎఫ్‌టిసిసిఐ పోకర్ణ స్కిల్ సెంటర్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. తయారీ రంగంలో నైపుణ్యం కలిగిన మానవశక్తి ఎల్లప్పుడూ తక్కువగా ఉంటుందన్నారు. ఈ రంగంలో నైపుణ్యాలను పెంచాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో మారుతున్న కాలానికి అనుగుణంగా మానవశక్తిని నైపుణ్యం చేయడం ఈ రంగంలో నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి అవసరాలను తీర్చడం తప్పనిసరి అని పేర్కొన్నారు. తయారీలోని సముచిత, విశిష్టమైన రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. అనుభవపూర్వక అభ్యాసంపై దృష్టి పెట్టాలన్నారు. మెరుగైన ఉద్యోగ అవకాశాలు, సహకారం కోసం డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డిఇఇటి)తో సంప్రదింపులను సులభతరం చేస్తామన్నారు. గడిచిన ఎనిమిదేళ్లలో రాష్ట్రం పారిశ్రామిక రంగంలో విశేష వృద్ధిని కనబర్చిందని, వచ్చే 10, 15 ఏళ్లు అదే పెరుగుదల ఉండాలని రంజన్ ఆశించారు. కళాశాల, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇంజినీరింగ్‌లో చేరిన 62000 మంది విద్యార్థుల్లో 44000 మంది కంప్యూటర్ సైన్స్‌ను, 14,500 మంది ఎలక్ట్రానిక్స్‌ను ఎంచుకున్నారన్నారు. మిగిలిన 3500 మంది ఇతర విభాగాలను ఎంచుకున్నారని తెలిపారు. కాబట్టి పరిశ్రమ సమీప భవిష్యత్తులో కొన్ని రంగాలలో భారీ నైపుణ్యాల అంతరాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ఈ స్కిల్ సెంటర్ ద్వారా ఏడాదికి 20 వేల మందికి నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోకర్నా లిమిటెడ్ సిఎండి గౌతమ్ చంద్ జైన్, ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్, మాజీ ప్రెసిడెంట్ కె భాస్కర్ రెడ్డి, సిఇఒ కీర్తి నరవాణే తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

It is informed to the general public is that my client Smt Penumarthi Ratna kumari W/o P. Sathyanarayana Rao at H.No. 64-9-8/5, Ramakotaiah street, near Airtel Tower. Patamata lanka, Vijayawada Informed that she is owner of the below schedule residential plot having acquired' the same through the registered sale deed vide document No.6482 dated 29-10-1999 from its owner Smt.N. Radhika W/o N. Srinivasa Rao and others, the same was purchased from Ch. Govindaramaiah S/o Ch.Sathyanarayana by N.Radhika only by way of registered sale deed bearing document No. 4376 1997 dt 08-09-1997. Since then my client is in possession and enjoyment of the same. Except my client no body having any rights, title, interest and lawful possession over the schedule below proper-ty. My client further informed that if any body will be enter any illegal transactions like agreements, mortgage, sale deed and MOUs or any type of alienations basing on the fraudulent or fictitious documents by any third parties with reference to the below schedule plot, my client shall not responsible kw any illegal transactions by and in between the third parties and also my client shall take appropriate legal action either civil or criminal proceedings against the them. Hence, I request all the general public on hehall of my client not to enter any sale transactions with any third parties who have no any way concerned with reference to the below schedule plot.

Schedule Plot

All that the property in H.No.8-221, admeasuring 344 sq.yards in Sy.No 49/ AA In part and parcel of Sy..No. 49/B (part-1). in ar part and parcel of original Sy.No. 49 situated at Kanakadurga Colony, Qutbullapur village and Mandal, under GHMC Circle 15, Medchal, Malkajgiri, Telangala State bounded by; North: H.NO.8-220, South: Nighbours land, East: 25 ft wide road, and west: House No.8-223.

V.Eswaraiah Chowdary,
Advocate, Flat No.302,H.NO
Sri V enkateswara Residency ,
Tenali Road, Atmakuru Post,
Mangalagiri Mandal,
Guntur Dist-PIN 522302
cell No.9701226009

మనువాదుల ఆటలు సాగనివ్వం

- మను ధర్మానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడతాం
- టీచర్‌పై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం
- చలో కోటగిరికి తరలిన వామపక్ష, బహుజన, విద్యార్థి సంఘాల నాయకులు



ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

'కొందరు రాష్ట్రాన్ని మరో ఉత్తరభారతం చేయాలని తెలంగాణలో కలలు కంటున్నారని, తెలంగాణ ఉద్యమాల గడ్డ. ఎందరో వీరుల త్యాగాల వలన తెచ్చుకున్న తెలంగాణలో మనువాదుల నాటకాలు సాగనివ్వబోమని, మను ధర్మానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడి టీచర్ మల్లికార్జునకు అండగా ఉంటామని వామపక్ష, బహుజన, విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా కోటగిరిలో దళిత టీచర్‌ను కులంపేరుతో దూషించి బలవంతంగా గుడికి తీసుకెళ్లి అవమానించిన దుండగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల, బహుజన, విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం చలో కోటగిరికి తరలివెళ్లారు. కోటగిరి కొత్త బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం న్యాయవాది ఈశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. దళితుడైన మల్లికార్జున్‌ను కులం పేరుతో దూషించి దాడి చేయడంపై ఎస్, ఎస్‌టి, అట్రాసిటీ కేసు పెట్టినా నిందితులను ఇప్పటికీ అరెస్ట్ చేయకపోవడం సరికాదన్నారు.

మతోన్మాద శక్తులకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని, ఆర్టికల్ 24 ప్రకారం భావ ప్రకటన హక్కును కాలరాసే హక్కు ఎవరిచ్చారని, 48 గంటల్లో గాండ్ల శ్రీను తదితరులను అరెస్టు చేయకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మల్లికార్జున్‌పై ఈగ వాలితే చూస్తూ ఊరుకోమని, రుద్రూర్ నాయకులు మల్లికార్జున ఫోన్ చేసి ఇబ్బందులకు గురి చేశాడని, వెంటనే అతన్ని అరెస్టు చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

PUBLIC NOTICE

It is informed to the General Public that my clients 1. Ch.Ratna kumari W/o late Govindaramaiah, 2. Ch.V.L.Narayana S/o late Govindaramaiah, 3. Vijay Cherukuri S/o late Govindaramaiah and 4.Ch.Sirisha D/o late Govindaramaiah, Adarshanagar Colony, Opp; IDPL Colony, Qutbullapur Circle, Medchal Malkajgiri District that they are owners of the below schedule residential plots having acquired the same through the registered partition deed dt.08-2-2015 vide document NO. 15842/2015 registered at SRO Rangangareddy amoung them ie.„ wife and children of late Ch. Govindaramaiah who acquired the right and title and lawful possession by way of purchased from its original owners in the year 1979 by way of unregistered sale deed which was regularized by the concerned authorities in the year 1993, prior to regularized in the year 1983 the land was laid a residential plots divided into1 to 18 which were given the door numbers to the each plot. Except Our clients no body having any rights, title, interest and lawful possession over the below schedule property. My clients further informed that if any body will entered any illegal transactions like agreements, mortgage, sale deed and MOUs or any type of alienations from any third parties through the any fraudulent documents with reference to the below schedule property my clients shall not responsible for any illegal transactions by and in between the third parties and also my clients shall take appropriate legal action either civil or criminal proceedings against them. Hence, I request all the general public on behalf of my clients not to enter any sale transactions etc with any third parties who have nothing to do with the below schedule property.

SCHEDULE OF PROPERTY

All that the property in H.No.8-213 measuring 344 sq.yards in plot No. 15, Plot NO. 14A measuring 144 sq.yards, H.No.8-218 measuring 510 sq.yards in plot No. 10, H.No.8-219 measuring 400 sq.yars in plot NO.11, H.No.8-221 measuring 344 sq.yards in Plot No. 13 (which was sold to P.Ratnakumari), H.No.8-225 measuring 356 sq.yards in plot No.6, H.No.8-226 measuring 430 sq.yards in Plot No. 7, H.No.8-227 measuring 430 sq.yards in Plot No.8, Plot No.2 measuring 200 sq.yards, Plot NO.3 measuring 200 sq.yards, H.NO.8-222/3 measuring 200 sq.yards respectively in part and parcel of Sy.No.49/AA in part and parcel of original survey No.49B (part-1) situated at Kanakadurga Colony, Qutbullapur village and mandal, GHMC Circle 15, Medchal Malkajgiri district TS;

V.Eswaraiah Chowdary,
Advocate, Flat No.302,H.NO
Sri V enkateswara Residency ,
Tenali Road, Atmakuru Post,
Mangalagiri Mandal,
Guntur Dist-PIN 522302
cell No.9701226009



పర్చూరి బ్రదర్స్‌ను పురస్కరిస్తున్న దృశ్యం

మాటలను తూటాలు గా పేల్చిన పర్చూరి బ్రదర్స్

ప్రజాశక్తి-కల్చరల్

ఇంద్ర, కర్తవ్యం, సమర్ సింహ రెడ్డి వంటి ఫ్రాక్షన్ సినిమాలో మాస్ సంభాషణలు రాసిన పర్చూరి బ్రదర్స్ సామాజిక సామ్యవాద కమ్యూనిజం భావాలను తమ రచనలో పండించారని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ యువకళా వాహిని నిర్వహణలో విఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా పర్చూరి వెంకటేశ్వర రావు, పర్చూరి గోపాలకృష్ణ (పర్చూరి బ్రదర్స్) కు ఎన్‌టిఆర్ విశిష్ట రచనా పురస్కార ప్రదానోత్సవం సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పురస్కరం బహుకరించి మాట్లాడారు. తెలుగు చిత్ర సీమలో ఒక ఒరవడి ని సంభాషణలలో సృష్టించిన పర్చూరి బ్రదర్స్ సంభాషణలు ప్రజల నుంచి విశేష ఆదరణ పొందారని కొనియాడారు. అధ్యక్షత వహించిన కళా పోషకుడు సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు, గోపాలకష్ణ లు శరీరాల వారైనా వారి ఆత్మ ఒక్కటే నని అన్నారు. ఎన్.టి. ఆర్ అసిస్సులు లతో పర్చూరి బ్రదర్స్ గా సినీ రంగంలో చరిత్ర సృష్టించారని అన్నారు. చిత్ర దర్శకుడు గోపాల్ ప్రతిధ్వని తన తొలి సినిమా అని దీనికి సహకరించిన పర్చూరి బ్రదర్స్ సహ ప్రయాణం ఇంద్ర, బొబ్బిలి రాజా, వంటి హిట్ సినిమాలు అందించటానికి దోహద పడిందని వివరించారు. రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకష్ణ, కవి వెనిగేళ్ల రాంబాబు, నటి శివ పార్వతి తదితరులు సభలో పాల్గొనగా సంస్థ అధ్యక్షుడు లంకా లక్ష్మీ నారాయణ స్వాగతం పలుకగా భాగి శాస్త్రి వందన సమర్పణ చేశారు.

ఈ సందర్భంగా గోపాల కష్ణ రచించిన ఎన్ టీ.ఆర్ నా దేవుడు సంపుటిని రమణ అవిష్కరించారు కార్యక్రమం తొలుత మణి శాస్త్రి, వినోద్ బాబు బృందం ఎన్‌టిఆర్ చిత్రాల్లో ని పాటలు ఆకట్టుకున్నాయి.

జిఒ 21ని గెజిట్ చేయాలి

- వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సెక్యూరిటీ గార్డుల కోసం తీసుకొచ్చిన జిఒ నెంబర్ 21ని వెంటనే గెజిట్ చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిగార్డ్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సమావేశాన్ని బుధవారం సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం అనంతరం సహకార, వ్యవసాయ శాఖ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు, కార్మిక, ఉపాధి శాఖ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రాలను అందజేశారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కార్మిక శాఖ సెక్యూరిటీ సర్వీసెస్‌కు సంబంధించిన జిఒ 21 విడుదలై రెండేండ్లు కావస్తున్నా నేటికీ గెజిట్ చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులలో ప్రభుత్వ ఆదాయం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న వేలాది మంది సెక్యూరిటీ గార్డులకు అన్యాయం చేయడం తగదన్నారు. తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిగార్డ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ.. సెక్యూరిటీ ఏజెన్సీలు ఇపిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదన్నారు. దీంతో సెక్యూరిటీ గార్డులకు రావాల్సిన ప్రయోజనాలు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికులు పోరాటాలు చేసిన ఫలితంగా సెక్యూరిటీ ఏజెన్సీలు కాకుండా మార్కెట్ కమిటీలు నేరుగా ఇపిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని వ్యవసాయ మార్కెట్ సంచాలకులు మెమో విడుదల చేశారని గుర్తు చేశారు. ఈ మెమోను మార్కెట్ కమిటీలు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. వారికి కమిటీల ద్వారానే వేతనాలు చెల్లించాలనీ, మార్కెట్ యార్డులలో, చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సందర్భంలో అనేక ప్రమాదాలు జరిగిన పట్టించుకునే వారులేరన్నారు. ప్రమాదానికి గురైన సెక్యూరిటీ గార్డులందరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంగిడి లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్. కుమార స్వామి, వై.రామాంజయ్య, ఎస్.రమేష్ కార్యవర్గ సభ్యులు ఉపేందర్, ఎండి. యాకూబ్ అలీ, బి. వెంకటేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, సునీతా

నిరుపేదలకు అండగా నవతెలంగాణ

- కేలండర్ ఆవిష్కరించిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి,
- ఎమ్మెల్యే మదన్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

నవతెలంగాణ దినపత్రిక.. నిత్యం సమస్యలను వెలికితీస్తూ నిరుపేదలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి బుధవారం ఆమె నవతెలంగాణ కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నవతెలంగాణ పత్రిక ప్రజల పక్షాన పోరాడుతోందన్నారు. సమస్యలపై వార్తలు రాస్తూ ప్రజలకు, అధికారులకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి, నాయకులు మధుసూదన్ రెడ్డి, ఎంపీ విఠల్, ముకుందారెడ్డి, లక్ష్మణ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు లక్ష్మి దుర్గారెడ్డి, నవతెలంగాణ రిపోర్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- మోటర్ వాహన చట్టం-2019 రద్దు
- ఆర్‌టిసిని పరిరక్షించాలి : చుక్క రాములు
- సంగారెడ్డిలో రవాణా రంగ కార్మికుల సంఘర్ష యాత్ర ముగింపు
- పట్టణంలో భారీ ర్యాలీ



ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రవాణా రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికుల సంక్షేమం కోసం కేరళ తరహా సంక్షేమ బోర్డును తెలంగాణలోనూ ఏర్పాటు చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు.ఆల్‌ఇండియా పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఈ నెల 3వ తేదీన ఖమ్మం జిల్లాలో ప్రారంభమైన 'రవాణా రంగ కార్మికుల సంఘర్ష యాత్ర బుధవారం సంగారెడ్డిలో ముగిసింది. పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి సంగారెడ్డి బస్టాండ్ వరకు ఆటోలు, ట్రాలీలు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నటరాజ్ థియేటర్ సెంటర్‌లో నిర్వహించిన ముగింపు సభలో చుక్క రాములు మాట్లాడారు. రాష్ట్రంలో ఆటో, కారు, టాక్సీ, ట్రాలీ, ప్రయివేట్ బస్సు, లారీ, డిసిఎం, ఆర్‌టిసి బస్సు డ్రైవర్లు.. ఇలా ప్రభుత్వ, ప్రయివేటు రవాణా రంగంలో లక్షలాది మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. నెలంతా పనిచేస్తే వచ్చే ఆదాయంలో ముప్పావు వంతు టోల్‌ఫీజులు, పెనాల్టీలు, చలాన్స్‌కే సరిపోతుందని, మిగిలినదాంట్లోనే కుటుంబ వైద్య ఖర్చులు, పిల్లల ఫీజులు, ఇంటి అద్దెలకు ఉపయోగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలతో కుటుంబాలు గడిచే పరిస్థితి లేదన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఆర్‌టిసిలో బస్సులు తగ్గించడం మానుకోవాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన రెండు వేతన ఒప్పందాల్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఎన్నికలు జరపకుండా నిరంకుశ ధోరణి ప్రదర్శించడం సరైంది కాదన్నారు. మరో పక్క కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఉపయోగపడేలా మోటర్ వాహన చట్టం-2019 తీసుకొచ్చిందని, దీనివల్ల 15 ఏళ్ల తర్వాత ఏ వాహనమైనా రోడ్డుమీద నడిపే అవకాశంలేదన్నారు. దీని వల్ల పేద, మధ్య తరగతి వాళ్లు పాత వాహనాలు కొని నడుపుకునే వీల్లేదన్నారు. మోడీ రోడ్లు, విమానయానాలు, పోర్టులు, వనరుల్ని కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్నాడని విమర్శించారు. రవాణా కార్మికులు ఐక్యంగా పోరాడితే చట్టపరమైన సంక్షేమ బోర్డు, ఇతర సదుపాయాల్ని సాధించుకోవచ్చన్నారు.

ఆల్‌ఇండియా పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ రవాణా రంగ కార్మికుల సమస్యలను అధ్యయనం చేసేందుకే చేపట్టిన సంఘర్షయాత్ర అనేక అనుభవాలను నేర్పిందన్నారు. ఈ నెల 3న ఖమ్మంలో ప్రారంభమైన యాత్ర 24 జిల్లాలు, 49 పట్టణాల్లో 2780 కిలో మీటర్లు పర్యటించామన్నారు. రవాణా కార్మికుల ఇండ్లల్లోనే యాత్ర బృందం బస, భోజనం, టిఫిన్ చేసిందని, ఈ సందర్భంగా కార్మికుల కుటుంబాల స్థితిగతుల్ని పరిశీలించామన్నారు.

కులం, మతం, ప్రాంతం అనే బేధబావాలు లేకుండా రవాణా కార్మికులందరూ యాత్రకు స్వాగతం పలికారన్నారు. మోడీ మాత్రం మతం పేరిట చిచ్చు రగిల్చుతూ కార్మికులు, కర్షకుల్ని విభజిస్తూ పాలిస్తున్నాడని విమర్శించారు. ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. 2019 మోటర్ వాహన చట్టం వల్ల వాహనాలకు యజమానులుగా ఎవరున్నా వాటిని కంపెనీల్లోనే నడపాల్సి వస్తుందన్నారు. కనీసం వాహనం రిపేర్‌కు వస్తే కూడా కంపెనీలే చేస్తాయని, దీని వల్ల మెకానిక్, స్పేర్‌పార్ట్ వ్యాపారం దెబ్బతింటాయన్నారు. పోలీస్, ఆర్‌టిఎ అధికారుల వేధింపులు, పెనాల్టీలు, చలాన్స్ వ్యతిరేకంగా రాబోయే కాలంలో సమరశీలంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, బీరం మల్లేశం, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్యం, రవాణా రంగ నాయకులు వెంకటేశ్, మధు, మహేందర్, అన్వర్, సాయి, మల్లేష్, శ్రీనివాస్, రాహుల్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

గత ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను బిఆర్ఎస్ అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు మ్యానిఫెస్టోలో ప్రకటించిన అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పంచాలన్నారు. మిగిలిన వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అరులైన పేదలందరికీ రేషన్‌కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. ఈ ఏడాది రైతుబంధు కింద రూ.4600 కోట్లు మాత్రమే విడుదల చేశారని, ఇంకా రూ.3000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేసి రైతులందరికీ న్యాయం చేయాలన్నారు.

పోడు భూముల విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పట్టాలివ్వాలని కోరారు. లిఫ్టుల పరిస్థితి అధ్వానంగా ఉందని, ప్రభుత్వమే బాధ్యతగా తీసుకొని మరమ్మతులు చేపట్టి ప్రాజెక్టు అంతర్భాగంగా చూడాలన్నారు. ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న పార్టీలను, ప్రజాసంఘాలను కలుపుకొని పోయి దాన్ని అడ్డుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, డా.మల్లుగౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతిరామ్మూర్తి, లక్ష్మీనారాయణ,పాల్వాయి రాంరెడ్డి ఉన్నారు.

భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు



ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

బస్వాపురం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న బిఎన్ తిమ్మాపురం గ్రామ రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలకు 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపురం రిజర్వాయర్ కట్టమీద 44 రోజులుగా దీక్షలు చేస్తున్న తిమ్మాపురం గ్రామ నిర్వాసితులకు బుధవారం వ్యకాస జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాతల తరాల నుంచి గ్రామాన్ని ఏర్పాటు చేసుకొని అనేక కష్టనష్టాలకోర్చి జీవనం సాగిస్తున్నారని, ఇప్పుడు సర్వం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మాపురం నిర్వాసితులకు అండగా ఉండాల్సిందిపోయి ప్రభుత్వం బాధ్యతా రహితంగా వ్యవహరిస్తోందన్నారు. గ్రామస్తులు 44 రోజులుగా దీక్షలు చేస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తిమ్మాపురం గ్రామ నిర్వాసితులకు ఎకరానికి రూ.50 లక్షలు ఇచ్చినా తక్కువేనన్నారు. ఆర్‌ఆర్ చట్టంలో ఉన్న వాటిని అమలు చేయడానికి అధికారులకు, పాలకపక్షానికి బాధ ఏమిటని నిలదీశారు. ఇప్పటికైనా బస్వాపురం రిజర్వాయర్‌లో సర్వం కోల్పోతున్న తిమ్మాపురం గ్రామస్తులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని చదువుకున్న యువతీయువకులకు ఇరిగేషన్ డిపార్టుమెంటులో, యాదాద్రి టెంపుల్లో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ మాట్లాడారు. నిర్వాసితుల విషయంలో ఇప్పటికైనా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా మంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు అన్నంపట్ల కృష్ణ, సందెల రాజేష్, సర్పంచ్ పిన్నం లలిత రాజు, ఎంపీటీసీ ఉడత శారద ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గూగుల్‌కు ఎన్‌సిఎల్‌టి మరో షాక్..

న్యూఢిల్లీ : గూగుల్ ప్లే స్టోర్ అనైతిక వ్యాపార పద్ధతులపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఇచ్చిన ఉత్తర్వులపై మధ్యంతర ఆదేశాలు ఇచ్చేందుకు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) నిరాకరించింది. సిసిఐ విధించిన జరిమానా మొత్తం రూ.936.44 కోట్లలో 10 శాతం సొమ్మును నాలుగు వారాల్లో తమ రిజిస్ట్రీ వద్ద డిపాజిట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 17కు వాయిదా వేసింది. ప్లే స్టోర్ విధానాల్లో గుత్తాధిపత్యాన్ని గూగుల్ దుర్వినియోగం చేస్తుండటంతో సిసిఐ రూ.936.44 కోట్ల భారీ జరిమానా విధించింది. కాగా.. వారంలోనే ఎన్‌సిఎల్‌టిలో గూగుల్‌కు రెండో సారి ఎదురు దెబ్బ తగిలినట్లయ్యింది. ఇటీవల ఆండ్రాయిడ్ మొబైల్ విభాగంలో గూగుల్ గుత్తాధిపత్యంపై సిసిఐ రూ.1,338 కోట్ల జరిమానా వేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించగా.. తొలుత ఈ జరిమానా మొత్తంలో 10 శాతం సొమ్మును డిపాజిట్ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీన్ని గూగుల్ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. 16న విచారణకు రానుంది.

సామ్‌సంగ్‌లో గెలాక్సీ ఎస్ సీరిస్ వస్తోంది..

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ తన గెలాక్సీలో ఎస్ సీరిస్‌ను ఆవిష్కరించనున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి ఒక్కటో తేదిన శాన్ ఫ్రాన్సిస్కోలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. దీంతో గెలాక్సీలో నూతన యుగం ఇనోవేషన్ రాబోతుందని పేర్కొంది. దీంతో అంతిమ ప్రీమియం అనుభవాన్ని నిర్వహించనున్నామని ఆ కంపెనీ తెలిపింది. నూతన ప్రమాణాలతో దీన్ని డిజైన్ చేస్తున్నట్లు పేర్కొంది.

ఫిబ్రవరిలో ప్లాస్ట్ ఇండియా ఎక్స్‌పో

న్యూఢిల్లీ : ప్లాస్టిక్స్ రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్లాస్ట్ ఇండియా సంస్థ 11వ ఎడిషన్ ఇంటర్నేషనల్ ప్లాస్టిక్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనను ఫిబ్రవరి ఒకటి నుంచి ఐదవ తేది వరకు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ప్లాస్ట్ ఇండియా-2023ను న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరుగనుందని తెలిపింది. ఆసియాలో అతిపెద్ద ప్లాస్టిక్ ఎగ్జిబిషన్‌గా గుర్తింపు పొందిన ఈ ఎక్స్‌పోలో ప్రపంచవ్యాప్తంగా 1800 మంది ఎగ్జిబిటర్లు పాల్గొననున్నారని ప్లాస్ట్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షులు జిగేష్ దోషి తెలిపారు. కరోనా కారణంగా దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

బిగ్ సి లక్కీడ్రా విజేతలు వీరే



హైదరాబాద్ : ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ సి తన 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రకటించిన ఆఫర్లలో భాగంగా రెండవ లక్కీ డ్రాను విజయవంతంగా నిర్వహించింది. ఈ లక్కీ డ్రాలోని విజేతలను ఆ సంస్థ వ్యవస్థాపకులు, సిఎండి బాలు చౌదరీ బుధవారం ప్రకటించారు. రెండో లక్కీ డ్రాలో ఏడు చొప్పున మారుతి సుజుకి ఆల్టో కార్లు, బజాజ్ ప్లాటినా బైకులు, రిఫ్రిజిరేటర్లు, ఎసిలు, టివిల విజేతలను ప్రకటించింది. 35 మంది విజేతలను ఎంపిక చేసింది. లక్కీ డ్రా విజేతలతో పాటుగా బిగ్ సిలో చేసే ప్రతీ కొనుగోలుపై డిస్కౌంట్‌తో పాటుగా ఖచ్చితమైన బహుమతిని అందిస్తున్నామని బాలు చౌదరి తెలిపారు. రెండో లక్కీడ్రాలో ఎస్‌కె రేష్మ, మాదరి రాహుల్ రాయ్, గడ్డం అనురాధా, ఎ ఆకాశ్, ఎం బాస్కర్, హెచ్ నౌషద్, జె శేఖర్ ఆల్టో కారులను గెలుపొందిన వారిలో ఉన్నారు. తమ వద్ద స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ టివి, ల్యాప్ టాప్ కొనుగోలు చేసిన ఖాతాదారులకు లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు 20 కార్లు, 20 బైకులు, 20 ఎసిలు, 20 రిఫ్రిజిరేటర్లు, 20 టివిలు బహుమతిగా ఇస్తామని బాలు చౌదరీ తెలిపారు. వీటితో పాటు ప్రతీ మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి, 10 శాతం వరకు క్యాష్ బ్యాక్, సులభ వాయిదాల పద్ధతిలో చెల్లింపులు, డౌన్ పేమెంట్ లేకుండా మొబైల్ కొనుగోలు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆఫర్లు డిసెంబర్ 3 నుంచి 2023 జనవరి 29 వరకు అందుబాటులో ఉంటాయని బాలు చౌదరి తెలిపారు. వార్షికోత్సవ ఆఫర్‌లో భాగంగా 20 చొప్పున మారుతి సుజుకి ఆల్టో కార్లు, బజాజ్ ప్లాటినా బైకులు, రిఫ్రిజిరేటర్లు, ఎసిలు, టివిలను విజేతాలకు అందించనున్నట్లు తొలుత ప్రకటించిన విషయం తెలిసిందే.

ఆటో ఎక్స్‌పోలో విద్యుత్ వాహనాలపైనే దృష్టి

న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మక ఆటో ఎక్స్‌పో 2023 గ్రేటర్ నోయిడాలో బుధవారం వేడుకగా ప్రారంభమైంది. మూడేళ్ల తర్వాత తొలి సారి జరుగుతున్న ఈ ప్రదర్శనలో పలు కంపెనీలు తమ కొత్త వాహనాలను ప్రదర్శనకు ఉంచాయి. అబ్బురపరిచే వాహనాలతో చూపరులను కనవిందు చేస్తున్నాయి. ఈ ఎక్స్‌పోలో టాటా మోటార్స్, కియా ఇండియా, మారుతీ సుజుకీ, హ్యుందాయ్, ఎంజి మోటార్, జెబిఎం ఆటో తదితర వాహన కంపెనీలు తమ మోడళ్లను ప్రదర్శనకు ఉంచాయి. ఈ దఫా విద్యుత్ వాహనాలపై ఎక్కువ దృష్టి నెలకొంది. మెజారిటీ ఆటో మొబైల్ కంపెనీలు తమ నూతన ఇవి కాన్సెప్ట్ మోడళ్లను ప్రదర్శించాయి. 45 దేశీయ, అంతర్జాతీయ తయారీ కంపెనీల తమ కొత్త మోడళ్లు, విద్యుత్తు కార్లు, కాన్సెప్ట్ కార్లు, త్రిచక్ర, ద్విచక్ర వాహనాలు, వాణిజ్య వాహనాలను ప్రదర్శనకు ఉంచాయి.

హ్యుందాయ్ నుంచి ఐయోనిక్5

హ్యుందాయ్ మోటార్స్ తన ఐయోనిక్ 5 విద్యుత్ కారును ఆవిష్కరించింది. దీంతో పాటు స్లీక్ అండ్ ఫుల్లీ ఎలక్ట్రిక్ సెడాన్ ఐయోనిక్ 6ని కూడా ప్రదర్శించింది. దీన్ని బాలీవుడ్ హీరో షారూఖ్ ఖాన్ ఆవిష్కరించడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐయోనిక్5 ప్రారంభ ధర రూ.44.95 లక్షలుగా ఆ కంపెనీ నిర్ణయించింది.

మారుతి నుంచి ఇవిఎక్స్

మారుతి సుజుకి కొత్తగా ఎస్‌యువి కాన్సెప్ట్‌లో ఇవిఎక్స్ విద్యుత్ కారును ఆవిష్కరించింది. దీన్ని ఒక్క సారి చార్జింగ్ చేస్తే 550 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని ఆ సంస్థ తెలిపింది. 2025 నాటికి దీన్ని మార్కెట్లోకి అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించింది. ఎక్స్‌పోలో ఈ సంస్థ తన 16 వాహనాలను ప్రదర్శనకు పెట్టింది.

ఎంజి హెక్టార్ కొత్త హెక్టార్..

ఎంజి మోటార్ ఇండియా తన తర్వాతి తరం ఎంజి హెక్టార్‌ను విడుదల చేసింది. ఐదు వేరియంట్లలో లభించనున్న ఈ వాహన ఎక్స్‌షోరూం ధరను రూ.14.72 లక్షలుగా నిర్ణయించింది.

టాటా మోటార్స్ ఇవి-అవిన్యా..

టాటా మోటార్స్ తన ఇవి కాన్సెప్ట్ కారు అవిన్యాను తొలిసారి ప్రదర్శించింది. దీన్ని టాటా గ్రూపు ఛైర్మన్ ఎన్ చంద్ర శేఖరన్, టాటా ప్యాసింజర్ వెహికల్స్ బిజినెస్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర ఆవిష్కరించారు. ఎక్స్‌పోలో తన టాటా హారియర్ ఇవి, సియోర్రా ఇవి, టాటా పంచ్, అల్ట్రోజ్‌ను ప్రదర్శించింది.

కియా నుంచి ఇవి 9

కియా ఇండియా తన ఇవి9, కెవి4 విద్యుత్ వాహనాలను ఆవిష్కరించింది. వచ్చే నాలుగేళ్లలో విద్యుత్ రంగంలో రూ.2వేల కోట్ల పెట్టుబడులను ప్రకటించింది. ఈ మొత్తాన్ని ఆర్‌అండ్‌డి, మౌలిక వసతులు, తయారీకి ఉపయోగించనున్నట్లు తెలిపింది.

గుంట భూమీ వదిలిపెట్టబోం

- మాస్టర్‌ప్లాన్ రద్దు చేయకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం
- కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా
- తెల్లవారుజామునుంచే ముందస్తు అరెస్టులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, నేడు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి ముసాయిదా ప్రతిపాదనను రద్దు చేస్తున్నట్టు తీర్మానించాలని రైతులు డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని, ఇకపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రాణం పోయినా గుంట భూమి కూడా వదిలిపెట్టేది లేదని తేల్చిచెప్పారు. మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కాగా ధర్నాలో పాల్గొనకుండా పలువురు రైతులను పోలీసులు తెల్లవారుజాము నుంచే ముందస్తుగా అరెస్టు చేశారు. ముందే అనుమతి తీసుకున్నా అరెస్టులు చేయడం పట్ల పోలీసుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధర్నా సమాయనికి ముందే మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ స్థాయిలో చేరుకున్నారు. ర్యాపిడ్ ఫోర్స్‌ను రంగంలోకి దించారు. కార్యాలయ గేటును మూసివేశారు. మున్సిపల్ సిబ్బంది, మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు తెలిపే రైతులు, ఇతర ఎమర్జెన్సీ పనులు ఉన్నవారిని మాత్రమే పోలీసులు లోపలికి అనుమతించారు. అల్లర్లు జరిగితే అరెస్ట్ చేయడానికి సిద్ధమయ్యారు. అందుబాటులో రెండు డీసీఎం వ్యానులనూ ఉంచారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద జరిగిన ఘటనలు జరగకుండా ఉండేందుకు పక్కాగా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే రైతులు శాంతియుతంగా నిరసన చేపట్టి అనుకున్న సమయానికి విరమించారు. ధర్నాలో అడ్లూర్ ఎల్లారెడ్డి టిఆర్ఎస్ నాయకులు సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తాము చేసే ఉద్యమం తమ పిల్లల భవిష్యత్తు కోసమేనన్నారు. ఉన్న భూమిని కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందన్న ఆవేదన ప్రభుత్వానికి తెలియజేయడం కోసమేనని తెలిపారు. తమకు జీవనాధారంగా ఉన్న భూమిని కాపాడుకోవడం కోసమే పోరాటం చేస్తున్నామే కాని రాజకీయంగా తమకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదన్నారు. తమకు మద్దతు తెలిపి మాస్టర్ ప్లాన్ రద్దు చేయాల్సిన నాయకులు భిన్న ప్రకటనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉద్యమానికి మద్దతివ్వాల్సింది పోయి పెయిడ్ వర్కర్లు అంటూ హేళన చేసి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము రైతులం కాదా.. తమ వద్ద ఓట్లు అడుక్కోలేదా అని నిలదీశారు. న్యాయం కోసం రోడ్డెక్కితే పెయిడ్ వర్కర్లుగా కనిపిస్తున్నమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఒకరేమో పెయిడ్ వర్కర్లు అంటారు. మరొకరేమో ఇది మున్సిపల్ చేసిన తీర్మానం కాదని, అధికారులు, కన్సల్టెన్సీ వాళ్ళ తప్పిదమంటారు. తప్పిదమని రైతులు రోడ్డెక్కిన నెల రోజులకు గుర్తించారా? అని ప్రశ్నించారు. మీ తప్పిదం లేకపోతే.. వాళ్లదే తప్పిదం అయితే ఇన్నాళ్లుఎందుకు ఊరుకున్నారని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మొదటి రోజే మున్సిపల్ ముట్టడి సమయంలో ఈ విషయం చెప్పి ముసాయిదా డ్రాఫ్టును మారుస్తామని, ఇండస్ట్రియల్ జోన్‌ను ప్రభుత్వ భూముల్లోకి మళ్లిస్తామని ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు. ఇప్పటికైనా మీ మాట నిలుపుకోవాలని, మాస్టర్ ప్లాన్ ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని, లేకపోతే భవిష్యత్‌లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

పోరాడితేనే బతుకు

- ఆ దిశగానే విద్యుత్ ఉద్యోగుల కార్యాచరణ ఉండాలి
- టిఎస్‌యుఇఇ డైరీ ఆవిష్కరణలో నవతెలంగాణ ఎడిటర్ ఆర్ సుధాభాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థల పరిరక్షణ కోసం మిలిటెంట్ పోరాటాలే శరణ్యమని, అప్పుడే ఉద్యోగులు, వ్యవస్థ బతకగలుగుతాయని నవతెలంగాణ దినపత్రిక సంపాదకులు ఆర్ సుధాభాస్కర్ అన్నారు. పోరాటాలు ఉంటేనే యూనియన్లూ బలపడతాయని చెప్పారు. తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టిఎస్‌యుఇఇ) ఆధ్వర్యాన బుధవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 2023 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై డైరీ ఆవిష్కరించి, మాట్లాడారు. విద్యుత్ శాఖలో ఒకప్పుడు అధికారులు కాంట్రాక్ట్ కార్మికులతో టిఫిన్ బాక్సులు కడిగించేవారని, వారంతా సంఘటితం అయ్యాక ఆపని చేయించేందుకు ఎవరూ సాహసించట్లేదనీ, సంఘానికి ఉండే బలం అదేనని ఉదహరించారు. విద్యుత్‌రంగంలో 1996 నుంచి ప్రయివేటీకరణ విధానాలు ప్రారంభమయ్యాయనీ, 2001లో విద్యుత్ చట్టం తయారైతే, 2003లో అప్పటి ప్రధాన మంత్రి వాజ్‌పేయి ప్రభుత్వం దాన్ని ఆమోదించిందనీ, చట్ట సవరణల పేరుతో ఇప్పుడు మోడీ ప్రభుత్వం దాని అమలును మరింత వేగవంతం చేసిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం విద్యుత్ చట్టాన్ని వ్యతిరేకించట్లేదనీ, సవరణ బిల్లు-2022ను మాత్రమే వ్యతిరేకిస్తున్నదనే విషయాన్ని గమనించాలని సూచించారు. మహారాష్ట్రలో ఎన్రాన్ వంటి బహుళజాతి సంస్థలు ప్రజాధనాన్ని లూటీ చేసి, బోర్డులు తిప్పేస్తే, ఆ విద్యుత్‌ప్లాంట్లను గెయిల్, ఎన్‌టిపిసి వంటి ప్రభుత్వరంగ సంస్థలు నిర్వహణ చేపట్టాయని గుర్తుచేశారు. ప్రయివేటు పెట్టుబడిదారుల వల్ల ఇలాంటి దుష్పరిణామాలు ఉంటాయనే అనుభవం ఉన్నా, కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకొనే దిశగా ఎలాంటి ప్రయత్నం చేయట్లేదని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లులో 'ఆవరణ' (ప్రెమిసెస్) అనే పదాన్ని విస్తరించి, దాన్ని దేశవ్యాప్తం చేశారని చెప్పారు. ఫలితంగా ఆయా రాష్ట్రాల్లో ఎక్కడ తక్కువ ధరకు కరెంటు దొరికితే, అక్కడి నుంచి పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు ఎక్కడికైనా విద్యుత్‌ను తెప్పించుకొనే సౌకర్యం కల్పించారని తెలిపారు. దీనివల్ల ఆయా రాష్ట్రాల్లోని విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) పరిధి కుదించుకుపోతుందనీ, ఇక ఉద్యోగులు, హక్కులు, రెగ్యులరైజేషన్, వేతన సవరణలు వంటి వాటికి ఆస్కారం ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఈ ప్రమాదాలను విద్యుత్ ఉద్యోగులు గుర్తించాలని హెచ్చరించారు. మహారాష్ట్రలో ఓ ప్రాంత విద్యుత్ పంపిణీని అదానీకి అప్పగించే ప్రయత్నం చేస్తే, అక్కడి ఉద్యోగులు పోరాటాల ద్వారా తిప్పికొట్టగలిగారనీ, ఛత్తీస్‌గఢ్, పాండిచ్చేరిలోనూ ఇలాంటి ఉద్యమాలే ప్రభుత్వ విద్యుత్ సంస్థల్ని కాపాడాయని గుర్తుచేశారు.

టిఎస్‌యుఇఇ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ గోవర్ధన్ వాల్ క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు పరిష్కరించుకోవాల్సిన సమస్యలు, సాధించాల్సిన హక్కులు అనేకం ఉన్నాయని చెప్పారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమం భవిష్యత్ ఉద్యమ రూపానికి వేదిక అనీ, విద్యుత్ ఉద్యోగులు మెడపై ప్రయివేటీకణ కత్తి వేలాడుతూనే ఉన్నదని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంటు స్టాండింగ్ కమిటీకి పంపిందనీ, ఆ కమిటీలో మెజారిటీ సభ్యులు బిజెపికి చెందినవారే ఉన్నందున, అక్కడ ఆ బిల్లును తిరస్కరిస్తారనే భ్రమలు తమకేం లేవని స్పష్టం చేశారు. కేంద్రం మొండిగా ఆ బిల్లును చట్టరూపంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తే దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు మెరుపు సమ్మె చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు కూడా ఈ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు, రైతులు, ప్రజలు కలిసికట్టుగా కొట్లాడితేనే కేంద్రం మెడలు వంచి, ఈ బిల్లును తిప్పికొట్టగలమని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులకు 2022 పీఆర్సీ బకాయి ఉన్నదన్నారు. సంస్థల పరిరక్షణ, హక్కుల సాధనలో భాగంగా ఈనెల 17న రాష్ట్రంలోని అన్ని ఎస్ఈ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 10 నుంచి 24వ తేదీ వరకు అన్ని విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులను చైతన్యపరుస్తూ జీపు జాతాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి టిఎస్‌యుఇఇ రాష్ట్ర అధ్యక్షులు కే ఈశ్వరరావు అధ్యక్షత వహించి, టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు వీ కుమారచారి తెలుగు క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ స్వామి, ఉపాధ్యక్షులు కె మధు, వెంకటేశ్వర్లు, టిఎస్ఎస్‌పిడిసిఎల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ చంద్రారెడ్డి, కె సత్యం, టిఎస్ఎన్‌పిడిసిఎల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.